ఘనంగా అంజన్‌కుమార్ పుట్టిన రోజు వేడుకలు



మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్ పుట్టిన రోజు సందర్భంగా కేక్ కట్ చేస్తున్న యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి అరవింద్‌కుమార్‌యాదవ్

రాంనగర్, మే 5 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ నియోజకవర్గం అభివృద్ధి, ప్రజల సంక్షేమానికి మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్ చేసిన సేవలు దానం నాగేందర్ గెలుపుకు దోహదపడతాయని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి అరవింద్‌కుమార్‌యాదవ్ అన్నారు. ఆదివారం ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో జరిగిన అంజన్‌కుమార్‌యాదవ్ జన్మదిన వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరైన అరవింద్‌కుమార్‌యాదవ్ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా పలు సేవా కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా అరవింద్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ అంజన్‌కుమార్‌యాదవ్ ఎంపీగా చేసిన కార్యక్రమాలను ముషీరాబాద్ నియోజకవర్గంలో ప్రజలకు తెలియజేసి దానం నాగేందర్‌కు అత్యధిక ఓట్లు తీసుకువచ్చి దానం నాయకత్వానికి అండగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ముషీరాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులు కృష్ణగౌడ్, అమరం వినోద్, నాయుడు రవి, మాజీ కార్పొరేటర్ కల్పనాయాదవ్, నాయకులు లోకేష్‌యాదవ్, శ్యామ్‌యాదవ్, తిరుమల్, సయ్యద్ జుబేర్ హుస్సేన్, అంజిరెడ్డి, గోవింద్ వెంకట్రావ్, నైషధం సత్యనారాయణమూర్తి, శ్రీనివాస్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.



అంజన్‌కుమార్‌యాదవ్‌ను సన్మానిస్తున్న వెంకటగోవిందరావు, జానకి సుధాకర్ తదితరులు

చిక్కడపల్లి, మే 5 (ఆంధ్రజ్యోతి): టీపీసీసీ వర్కింగ్ అధ్యక్షుడు, ముషీరాబాద్ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఎం.అంజన్‌కుమార్ యాదవ్ పుట్టిన రోజు ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు, సినీనటులు, డా.సి. వెంకటగోవిందరావు ఈ సందర్భంగా అంజన్‌కుమార్ యాదవ్‌ను ఘనంగా సన్మానించి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. అంజన్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ రానున్న పార్లమెంటు ఎన్నికల్లో అత్యధిక సీట్లు కైవసం చేసుకుంటుందన్నారు. కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ నగర కాంగ్రెస్ మాజీ ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్, నాయకులు జానకి సుధాకర్, శీలం సత్యనారాయణ, వెంకట్రావ్, నర్సింగ్‌రావు, జయేందర్ బాబు, గుర్రం శంకర్, సాల్మన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.



కవాడిగూడ గౌడ సంఘం కార్యాలయాన్ని ప్రారంభించిన గౌడ సంఘం అధ్యక్షుడు సానెం హరీష్‌గౌడ్, చీఫ్ ప్రమోటర్ దూడల శంకర్‌గౌడ్, రాజాగౌడ్

గౌడ కులస్థుల హక్కుల సాధనకు కృషి చేయాలి

- కవాడిగూడ గౌడ సంఘం ప్రతినిధులు

కవాడిగూడ, మే 5 (ఆంధ్రజ్యోతి): గౌడ కులస్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంతో పాటు వారి హక్కుల సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కవాడిగూడ గౌడ సంఘం అధ్యక్షుడు సానెం హరీష్‌గౌడ్, చీఫ్ ప్రమోటర్ దూడల శంకర్‌గౌడ్, రాజాగౌడ్ గౌడ సంఘం సభ్యులకు పిలుపునిచ్చారు. ఆదివారం కవాడిగూడ డివిజన్‌లో గౌడ సంఘం సభ్యులు ఏర్పాటు చేసిన కార్యాలయాన్ని ప్రారంభించారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గౌడ కులస్థులు అన్ని రంగాల్లో వెనకబడ్డారని వారి అభివృద్ధి, సంక్షేమానికి నూతన గౌడ సంఘం కార్యాలయంలో ఉన్న ప్రతినిధులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు అంజయ్యగౌడ్, ప్రతాప్‌గౌడ్, మద్దెల చంద్రయ్యగౌడ్, మల్లేష్ గౌడ్, ప్రకాష్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, పెద్ది ప్రవీణ్‌గౌడ్, మధుగౌడ్, లింగాల రవిగౌడ్, అమర్‌గౌడ్, అరుణ్‌గౌడ్, కిషన్‌గౌడ్, వెంకటేష్‌గౌడ్, భిక్షపతిగౌడ్, రంజిత్‌గౌడ్, ఆనంద్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ స్టేట్ అవార్డుల ప్రదానం

చిక్కడపల్లి, మే 5 (ఆంధ్రజ్యోతి): భారతీయ సంప్రదాయ కళలను రాబోయే తరానికి అందించాలని విశ్రాంత ఐఏఎస్ అధికారి వివిఎన్ విష్ణు, హరికథా కళాకారులు ఉమామహేశ్వరి, డిఫెన్స్ అకౌంట్స్ అదనపు కంట్రోలర్ సంగీత అన్నారు. అంతర్జాతీయ నాట్య దినోత్సవం సందర్భంగా ది డాన్స్ ఇండియా సంస్థ మ్యాగజైన్ ఆధ్వర్యంలో ఆదివారం త్యాగరాయగానసభలో తెలంగాణ స్టేట్ అవార్డుల ప్రదాన సభ జరిగింది. ముఖ్యఅతిథులుగా పాల్గొన్న వారు మాట్లాడుతూ అవార్డులు ఎంతో ప్రోత్సాహాన్ని ఇవ్వడంతోపాటు సమాజప్రగతికి తమ తమ రంగాల ద్వారా మరింత కృషి జరిపేలా ప్రోత్సహిస్తాయన్నారు. సిల్వర్ గుంగ్రూ అవార్డును నృత్య గురువులు కళాకృష్ణకు, పసుమర్తి శేషుబాబులకు అందజేశారు. వివిధ రంగాలకు చెందిన యశోద ఠాకూర్, మహ్మద్‌రఫీ, సంజయ్‌జోషి, మంతా శ్రీనివాస్, చారి, మధుసూదన్, మాధవిశర్మ, పవన్‌కుమార్, మంజు, సోను, మృత్యుంజయం శర్మ, లక్ష్మీప్రియలకు అవార్డులు అందజేశారు. కార్యక్రమ నిర్వాహక సంస్థ కో ఆర్డినేటర్ ఎం. భారతి, బీఆర్ విక్రమ్‌కుమార్, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

‘ పుస్తక పఠనాన్ని విస్మరించరాదు’

చిక్కడపల్లి, మే 5 (ఆంధ్రజ్యోతి): సాంకేతికాభివృద్ధి ఎంత పెరిగినా కూడా పుస్తకపఠనం తప్పనిసరి అని ఎస్‌బీఐ మాజీ ఏజీఎం చింతలపూడి త్రినాథరావు అన్నారు. పుస్తకపఠనం కల్చరల్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం త్యాగరాయగాన సభలో ఏఎం రాజా, మాధవపెద్ది, పిఠాపురం పాడిన పాటల సంకలనం మధుర గాన సుమాలు పుస్తక పరిచయ సభ జరిగింది. పుస్తక సంకలనకర్త నారాయణ డీవీఎస్ పరిచయం చేశారు. ఈ సందర్భంగా త్రినాథరావు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ విజ్ఞానాభివృద్ధికి పుస్తకాల పఠనం చాలా అవసరం అన్నారు. త్రినాథరావుకు నటగాన సాహిత్య సేవా విశారద మహానంది, న్యాయవాది చెంది మహేంద్రరెడ్డికి సామాజిక న్యాయ మహానంది పురస్కారాలు బహూకరించారు. పల్లా సోమసుందరం, నాగరాజు, నృసింహదేవర ఆదినారాయణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ ఉద్యమకారుడు సర్దార్ గురుచరణ్‌సింగ్ సంతాపసభలో నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నేతలు

సర్దార్ గురుచరణ్‌సింగ్ సంతాపసభ

రాంనగర్, మే 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమకారుడు సర్దార్ గురుచరణ్‌సింగ్ సంతాపసభ ఆదివారం నిర్వహించారు. రాంనగర్ చౌరస్తాలోని అమరవీరుల స్తూపం వద్ద బీఆర్ఎస్ రాంనగర్ డివిజన్ ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షుడు ఎర్రం శేఖర్ ఆధ్వర్యంలో జరిగింది. మాజీ కార్పొరేటర్ వి. శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ యువజన నాయకుడు ముఠా జైసింహ, ఉద్యమకారులు రేషం మల్లేష్, సిరిగిరి శ్యామ్, ఆకుల శ్రీనివాస్, డేవిడ్‌రాజ్, గిరి, సత్యనారాయణ తదితరులు పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో తెలంగాణ బాలోత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న రమేష్

రాంనగర్, మే 5 (ఆంధ్రజ్యోతి): చిన్నారుల్లో అంతర్లీనంగా నిక్షిప్తమైన సృజనాత్మకతను వెలికితీయడానికి తెలంగాణ బాలోత్సవం సంస్థ ఎంతో కృషి చేస్తుందని కేంద్ర బాల సాహితీవేత్త చొక్కాపు వెంకటరమణ ప్రశంసించారు. ఆదివారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో వేసవి సెలవుల్లో తెలంగాణ బాలోత్సవం సమ్మర్ క్యాంపు సుమారు 200 మంది విద్యార్థులతో ప్రారంభమైంది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఈ నెల 22వ తేదీ వరకు బాలోత్సవం సమ్మర్ క్యాంపు ఉంటుందన్నారు. ప్రస్తుత సమాజంలో విద్య ఒక్కటే కాదని కళలు, క్రీడలలోనూ ప్రావీణ్యత సాధించాలని చిన్నారులకు సూచించారు. చిన్నారుల్లో జ్ఞాపకశక్తిని ఫోకస్ చేసి ప్రతిభ పాటవాలను మెరుగుపరిచే విజ్ఞాన సమ్మర్ క్యాంపు తెలంగాణ బాలోత్సవం విజ్ఞానదాయకంగా నిర్వహిస్తుందన్నారు.

విజ్ఞాన దర్శిని ప్రతినిధి రమేష్ మాట్లాడుతూ పిల్లలకు విజ్ఞానశాస్త్ర, సామాజిక పర్యావరణ, ప్రకృతి పాఠాలు, మానవ సంబంధాలు వంటి విషయాలపై పెంపొందించుకోవడానికి సమ్మర్ క్యాంపులు దోహదపడతాయన్నారు. తెలంగాణ బాలోత్సవం అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆంగ్ల భాష మోజులో పడి తెలుగు మరిచిపోతున్న ఈతరానికి తెలుగు మాధుర్యాన్ని పంచే బాధ్యత అమ్మదనాన్ని తెలుగు ధనాన్ని తెలంగాణ బాలోత్సవం నేర్పిస్తుందన్నారు. కార్యక్రమంలో తెలంగాణ బాలోత్సవం కార్యదర్శి ఎన్. సోమయ్య, ఉపాధ్యక్షురాలు మమత కె. సుజావతి, కోశాధికారి బుచ్చిరెడ్డి, చంద్రయ్య పాల్గొన్నారు.

సామ్యవాద సాహితీ రుషి మహాకవి శ్రీశ్రీ

చిక్కడపల్లి, మే 5 (ఆంధ్రజ్యోతి): సామ్యవాద సాహితీ రుషి, మహాకవి శ్రీశ్రీ అని ప్రముఖ సాహితీ విమర్శకులు ప్రొ. పులికొండ సుబ్బాచారి అన్నారు. తెలుగు భాషా చైతన్యవేదిక, కుసుమ ధర్మన్న కళాపీఠం ఆధ్వర్యంలో ఆదివారం త్యాగరాయగానసభలో మహాకవి శ్రీశ్రీ జయంతి సభ జరిగింది. సుబ్బాచారి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ శ్రీశ్రీ శ్రామిక జీవుల సౌభాగ్యానికి తన కవితాశక్తిని ధారపోశారన్నారు. ప్రముఖ కవి రామకృష్ణ చంద్రమౌళి, తదితరులు పాల్గొన్నారు.

అంబర్‌పేటలో భారీ మెజారిటీ ఇవ్వండి

బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి పద్మారావుగౌడ్



గౌడ జనజాతర సమావేశంలో మాట్లాడుతున్న పద్మారావుగౌడ్, వేదికపై ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

రాంనగర్, మే 5 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల్లో గౌడ కులస్తులంతా ఐక్యమై ఒక్కొక్కరు మీతో పాటు మరో వంద మందితో ఓటు వేయించి తనను గెలిపించాలని సికింద్రాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి టి. పద్మారావు గౌడ్ పిలుపునిచ్చారు. బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లోని గౌడ సంఘం భవనంలో అంబర్‌పేట నియోజకవర్గం గౌడ జన జాతర (సమ్మేళనం) పంజాల గిరిధర్‌గౌడ్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన పద్మారావుగౌడ్ మాట్లాడుతూ కేసీఆర్ సీఎంగా ఉన్న సమయంలో గౌడ జాతికి న్యాయం చేసేందుకు తాను ఎక్సైజ్ శాఖను తీసుకుని మంత్రిగా వారి సమస్యల పరిష్కారానికి కృషి చేశానన్నారు. గౌడ కులస్థుల్లో ఐక్యత ఎంతో అవసరం అని అన్నారు. అంబర్‌పేటలో గౌడ కుటుంబాలు చాలా ఉన్నాయని, వారంతా ముందుకు వచ్చి లోక్‌సభ ఎన్నికల్లో తనకు ఓటు వేసి గెలిపిస్తే మీ కుల బిడ్డగా మొత్తం గౌడ జాతికి అండగా ఉంటానన్నారు. ఈ నెల 13న మన బలం ఏమిటో నిరూపించాలని కోరారు. అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో ఒక్క గౌడ కులస్థునిపై పగతో కల్లు దుకాణాలను మూసివేశారన్నారు.



కారుతో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ గ్రేటర్ యువజన కమిటీ సీనియర్ నాయకుడు ముఠా జైసింహ

ముషీరాబాద్ డివిజన్‌లో

ముషీరాబాద్, మే 5 (ఆంధ్రజ్యోతి): అన్ని వర్గాల ప్రజల మద్దతుతో సికింద్రాబాద్ లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థి టి. పద్మారావుగౌడ్ భారీ మెజార్టీతో విజయం సాధిస్తారని బీఆర్ఎస్ గ్రేటర్ యువజన కమిటీ సీనియర్ నాయకుడు ముఠా జైసింహ అన్నారు. ఆదివారం పద్మారావు గౌడ్‌కు మద్దతుగా ముషీరాబాద్ డివిజన్‌లోని కమలానెహ్రూనగర్, కుమ్మర సంఘం వీధి, గంగపుత్ర కాలనీలో కారు బొమ్మలతో ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశారు. కారు బొమ్మలను చూపిస్తూ కారు గుర్తుకు ఓటు వేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ముషీరాబాద్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీధర్‌రెడ్డి, ఆకుల అరుణ్‌కుమార్, భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాసరావు, మీడియా సెల్ ఇన్‌చార్జి ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

సికింద్రాబాద్‌లో బీజేపీ విజయం తథ్యం

కేంద్ర మంత్రి, బీజేపీ ఎంపీ అభ్యర్థి కిషన్‌రెడ్డి

బర్కత్‌పుర, మే 5 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్‌లో బీజేపీ విజయం తథ్యం అని, అన్ని వర్గాల ప్రజలు మోదీ మూడో సారి ప్రధాని కావాలని కోరుకుంటున్నారని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. ఓటింగ్ శాతం పెరగడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని, ముఖ్యంగా అపార్ట్‌మెంట్ వాసులు ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆదివారం బర్కత్‌పురలోని ప్యారగాన్ అపార్ట్‌మెంట్‌వాసులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబర్‌పేట నియోజకవర్గంలో తాను చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కన్నె ఉమాదేవి, బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, కోశాధికారి ఏ. సూర్యప్రకాష్‌సింగ్, డివిజన్ అధ్యక్షుడు కృష్ణకుమార్, నాయకులు అరవింద్, క్షీరసాగర్, లగ్నపురి సత్యనారాయణ, భరత్, రాజేందర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌వి బూటకపు ప్రచారాలు: లక్ష్మణ్

చిక్కడపల్లి, మే 5 (ఆంధ్రజ్యోతి): బీజేపీ కేంద్రంలో అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు తీసేస్తారని, రాజ్యాంగాన్ని మారుస్తారని కాంగ్రెస్ వారు బూటకపు ప్రచారాలు చేస్తున్నారని బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యులు, ఎంపి డా. కె. లక్ష్మణ్ ఆరోపించారు. ప్రజలందరూ ముక్తకంఠంతో మోదీని ప్రధాని చేయాలని కోరుతున్నారని ఆయన అన్నారు.. సికింద్రాబాద్ బీజేపీ అభ్యర్థి జి.కిషన్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ ఆదివారం గాంధీనగర్ డివిజన్‌లోని అరుంధతినగర్, సబర్మతినగర్, అన్నానగర్, దోబీఘాట్, మాలబస్తీ, ఎల్లయ్యబస్తీలలో ఆయన కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్‌తో కలిసి విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రజలను కలిసి బీజేపీకి ఓటు వేయాలని కోరారు. పాదయాత్రలో బీజేపీ నాయకులు వినయ్‌కుమార్, పూస రాజు, ఉమేష్, వీఎస్టీ రాజు, దామోదర్, శ్రీకాంత్, రత్నసాయిచంద్, నవీన్‌కుమార్, ఆనంద్‌రావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

అభివృద్ధి పనులను చూసి బీజేపీకి ఓట్లు వేయాలి

నల్లకుంట, మే 5 (ఆంధ్రజ్యోతి): కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అంబర్‌పేటలో చేసిన అభివృద్ధి పనులను చూసి ఎంపీ ఎన్నికల్లో కమలం పువ్వు గుర్తుకు ఓటు వేయాలని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎన్. మహేష్‌కుమార్ ప్రజలను అభ్యర్థించారు. ఆదివారం నల్లకుంట డివిజన్‌లోని టీఆర్‌టీ క్వార్టర్స్, అంజయ్యనగర్, ప్రశాంతినగర్ తదితర ప్రాంతాలలో సికింద్రాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి కిషన్‌రెడ్డికి మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

ముషీరాబాద్‌లో కార్పొరేటర్ సుప్రియ ప్రచారం

ముషీరాబాద్, మే 5 (ఆంధ్రజ్యోతి): బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డి రెండో సారి ఎంపీగా గెలవడం ఖాయమని ముషీరాబాద్ కార్పొరేటర్‌సుప్రియా నవీన్‌గౌడ్ అన్నారు. ఆదివారం బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డికి మద్దతుగా ముషీరాబాద్‌లో ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంచుతూ బీజేపీ నాయకులు ప్రచారం చేశారు.

అడిక్‌మెట్ డివిజన్‌లో

రాంనగర్, మే 5 (ఆంధ్రజ్యోతి): బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డిని గెలిపించి దేశంలో మోదీ నాయకత్వాన్ని బలపరచాలని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సూర్యనారాయణశర్మ సూచించారు. ఆదివారం అడిక్‌మెట్ డివిజన్‌లోని పద్మాకాలనీలో ఇంటింటికి తిరిగి ప్రచారం చేశారు.

ప్రలోభాలకు లొంగి ఓటును అమ్ముకోవద్దు



కరపత్రాన్ని అవిష్కరిస్తున్న జైభారత్ జస్ట్ ఓట్ తెలంగాణ ప్రచార కమిటీ నాయకులు

పంజాగుట్ట, మే 5 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో రాజకీయ నాయకులు ఇచ్చే డబ్బు, మద్యానికి ఆశపడి ఓటును అమ్ముకోవద్దని జైభారత్ జస్ట్ ఓట్ తెలంగాణ ప్రచార కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఖదిజ్జాసి సత్యనారాయణ గోల అన్నారు. కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రజాస్వామ్యాన్ని నిలబెడదాం కరపత్రాన్ని, మా ఓట్లు అమ్మబడవు అనే డోర్ స్టిక్కర్లను జైభారత్ గ్రేటర్ హైదరాబాద్ ముఖ్య సమన్వయకర్తలు బి.ఆర్ ప్రసాద్, వెంకటరమణ, అన్నమయ్య గృహ సాధన సమితి జాతీయ అధ్యక్షుడు విజయశంకర స్వామి, జైభారత్ అధికార ప్రతినిధి ఖదిజ్జాసి మల్లికా వల్లభతో కలిసి ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పార్టీలతో సంబంధం లేకుండా సమర్థులైన వారిని ఎన్నుకోవాలని సూచించారు. జస్ట్ ఓట్ ఉద్యమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా చేపడుతున్నామని, ప్రజలను చైతన్యం చేసేందుకు కృషి చేస్తామన్నారు. ప్రలోభాలకు లొంగి ఓటును అమ్ముకోవద్దన్నారు. నవనీత చోర బాలకృష్ణ మఠం వ్యవస్థాపకులు బాలకృష్ణానందస్వామి మాట్లాడుతూ.. మతతత్వ పార్టీలకు ఓటు వేయొద్దన్నారు. సమావేశంలో కమిటీ నాయకులు పి.రమణ, కె.నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

జేఎన్ఐఏఎస్ కాలేజీలో హైదరాబాద్ హెరిటేజ్ ఎగ్జిబిషన్



నమూనాలను తిలకిస్తున్న విద్యార్థులు

బంజారాహిల్స్, మే 5 (ఆంధ్రజ్యోతి): నగరానికి ప్రపంచ స్థాయి యునెస్కో గుర్తింపు రావాలని, చారిత్రక కట్టడాలు ఉన్న హైదరాబాద్‌ను హెరిటేజ్ నగరంగా ప్రకటించాలని జవహర్ లాల్ నెహ్రూ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్ స్టడీస్ కాలేజీ ఏర్పాటు చేసిన హెరిటేజ్ ఎగ్జిబిషన్ ఆలోచింపజేసింది. బంజారాహిల్స్‌లోని జేఎన్ఐఏఎస్ కాలేజీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ ఎగ్జిబిషన్‌ను కాలేజీ రిజిస్ట్రార్ డాక్టర్ దేవరకొండ సురేష్, డాక్టర్ వసంత శోభ ఆదివారం ప్రారంభించారు. ఎగ్జిబిషన్‌లో ఆర్కిటెక్ విద్యార్థులు నగర చరిత్రపై రూపొందించిన చార్ట్‌లు, నమూనాలు, హైదరాబాద్ గొప్పతనాన్ని ప్రతిబింబించే ఎన్నో చిత్రాలు, నిర్మాణాలను, విద్యార్థులు, చరిత్రకారులు తయారు చేసిన వందలాది నమూనాలను డిజటలైజ్ చేసి ప్రదర్శించారు.

ఈసారి యునెస్కో సదస్సుకు భారత దేశం ఆతిథ్యం ఇవ్వనున్న నేపథ్యంలో హైదరాబాద్ నగరాన్ని యునెస్కో గుర్తించేలా కృషి చేస్తామని వారు తెలిపారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ శాలిని కాకాని, ఏకే. సౌజన్య, పి.జోషి, ప్రియాంక, డాక్టర్ ఇ. శివనాగిరెడ్డి, ప్రొఫెసర్ వీవీఎల్. నరసింహం, శంకర్ నారాయణ్, అశోక్ బైరి, కల్పన రాఘవేంద్ర, శ్రీనివాస్, మూర్తి పాల్గొన్నారు.

దాతల సహకారంతో ప్రసన్నాంజనేయస్వామి ఆలయ అభివృద్ధి

ఎర్రగడ్డ, మే 5 (ఆంధ్రజ్యోతి): ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో ఆదివారం దీప స్తంభం ఏర్పాటు కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా దేవాలయ కమిటీ అధ్యక్షుడు, ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు గూడూరి చెన్నారెడ్డి మాట్లాడుతూ.. దేవాలయాన్ని దాతల సహకారంతో అభివృద్ధి చేస్తున్నామని, దాతలు వంశీ మోహన్ రెడ్డి, శోభారెడ్డి సహకారంతో దీప స్తంభం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో దేవాలయ ఈవో కృష్ణ, కమిటీ సభ్యులు జి. నరేందర్ రెడ్డి, మంజులారెడ్డి, కళ్యాణి, చిర్రావూరి శివరామకృష్ణ, కేహెచ్ఎస్ శర్మ, బి శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.



పూజల్లో దాతలు వంశీమోహన్‌రెడ్డి, శోభారెడ్డి, ఆలయ కమిటీ అధ్యక్షుడు చెన్నారెడ్డి తదితరులు

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరి అదృశ్యం



పల్లపు లక్ష్మి

మియాపూర్, మే 5 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు అదృశ్యమయ్యారు. మియాపూర్‌లో మహిళ, గుండ్లపోచంపల్లిలో ఓ వ్యక్తి కనిపించకుండా పోయారు. సికింద్రాబాద్ రైల్వేనగర్‌కాలనీకి చెందిన పల్లపు లక్ష్మి(40) మియాపూర్ మాతృశ్రీనగర్‌లో సహాయ స్వచ్ఛంద సంస్థలో పేషెంట్ కేర్‌టేకర్‌గా పనిచేస్తోంది. ఈనెల 3వ తేదీన ఇంటికి వస్తున్నానని, మియాపూర్ బస్టాప్ వద్ద బస్సు ఎక్కినట్లు కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చింది. ఆమె ఇంటికి వెళ్లలేదు. లక్ష్మి ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులు మియాపూర్ పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశారు.

టీ తాగేందుకు వెళ్లి..



పాపయ్య

పేట్‌బషీరాబాద్: టీ తాగేందుకు వెళ్లి ఓ వ్యక్తి కనిపించకుండాపోయాడు. గుండ్లపోచంపల్లిలో నివసిస్తున్న కొమ్ము పాపయ్య(60) గతనెల 30వ తేదీ ఉదయం 7 గంటలకు టీ తాగేందుకు ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అతడి ఆచూకీ లభించకపోవడంతో కుమారుడు గోపాల్ పేట్‌బషీరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.



రాంనగర్ చౌరస్తాలో రోడ్‌షోలో మాజీమంత్రి కేటీఆర్, బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్, ఎమ్మెల్యే ముఠా గోపాల్

కేటీఆర్ రోడ్‌షోకు భారీ స్పందన

- భారీగా తరలివచ్చిన పార్టీ నాయకులు, కార్యకర్తలు

రాంనగర్, మే 5 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్‌కు మద్దతుగా ముషీరాబాద్ నియోజకవర్గంలోని రాంనగర్ చౌరస్తాలో ఆదివారం రాత్రి ఎమ్మెల్యే ముఠా గోపాల్ ఆధ్వర్యంలో మాజీ మంత్రి కేటీఆర్ రోడ్‌షోకు విశేష స్పందన లభించింది. పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు భారీ ఎత్తున పాల్గొని తమ మద్దతు ప్రకటించారు. రోడ్‌షో నేపథ్యంలో రాంనగర్ చౌరస్తా నలువైపుల ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ జెండాలు, కటౌట్లతో ఈ ప్రాంతమంతా గులాబీమయంగా మారింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కళాకారుల సాంస్కృతిక కార్యక్రమాలను అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ రోడ్‌షోలో మంత్రి కేటీఆర్‌కు నాయకులు, కార్యకర్తలు ఈటలు, కేరింతలు పూలవర్షంతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో మంత్రి కేటీఆర్‌తో పాటు బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి పద్మారావు గౌడ్, మాజీ ఎమ్మెల్యే యశ్వంత్‌రెడ్డి, బీఆర్ఎస్ యువజన నాయకులు ముఠా జైసింహ, మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

టీపీసీసీ లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్‌గా ఎస్ఎస్ రావు



ఎస్ఎస్ రావు

బర్కత్‌పుర, మే 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్‌గా సీనియర్ న్యాయవాది ఎస్ఎస్ రావు నియమితులయ్యారు. ఆదివారం టీపీసీసీ లీగల్ సెల్ చైర్మన్ పొన్నం అశోక్‌గౌడ్ నియామకపు ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్ఎస్ రావు హైకోర్టులో సీనియర్ న్యాయవాదిగా పనిచేస్తున్నారు. గతంలో కేంద్ర మాజీ మంత్రి పి.శివశంకర్, మాజీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పి.సుధీర్‌కుమార్, మాజీ సీఎం మర్రి చెన్నారెడ్డిల ప్రధాన అనుచరుడిగా పనిచేశారు. ఈ సందర్భంగా రావు మాట్లాడుతూ రాష్ట్రంలోని న్యాయవాదులందరికీ రూ.20 లక్షల రూపాయల హెల్త్‌కార్డు కోసం సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానన్నారు. న్యాయవాదుల సంక్షేమానికి ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వం 100 కోట్లు విడుదల చేసిందని, ఈ నిధులు ప్రతియేటా విడుదల చేసే విధంగా ప్రభుత్వాన్ని కోరతానన్నారు. న్యాయవాదులకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలను కేటాయించే విధంగా తనవంతు కృషి చేస్తానని, వారి సంక్షేమానికి ప్రత్యేక శ్రద్ధ వహిస్తామన్నారు. కన్వీనర్‌గా నియమించినందుకు లీగల్ సెల్ చైర్మన్ పొన్నం అశోక్‌గౌడ్‌కు, సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

గాంధీనగర్ డివిజన్ నుంచి భానుచందర్



భానుచందర్

చిక్కడపల్లి, మే 5 (ఆంధ్రజ్యోతి): టీపీపీపీ లీగల్‌సెల్ కన్వీనర్‌గా గాంధీనగర్ డివిజన్‌కు చెందిన ప్రముఖ యువ న్యాయవాది డి. భానుచందర్ నియమితులయ్యారు. టీపీసీసీ లీగల్‌సెల్ చైర్మన్ పొన్నం అశోక్‌గౌడ్ భానుచందర్ నియామకాన్ని ఆదివారం ప్రకటించారు. ఈ సందర్భంగా భానుచందర్ మాట్లాడుతూ రానున్న పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల విజయం కోసం కృషి చేస్తానన్నారు. ముఖ్యంగా సికింద్రాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్ విజయంకోసం ముషీరాబాద్ నియోజకవర్గంలో విస్తృతంగా ప్రచారం చేస్తామన్నారు. పేద ప్రజలకు ఉచితంగా న్యాయసేవలు అందించేందుకు తనవంతుగా కృషి చేస్తానని ఆయన వివరించారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న హర్షిత్ శ్రీవాస్తవ, నవనీత్, ఆనంద్

సివిల్స్ అభ్యర్థులకు ఉచిత అవగాహన సదస్సు

చిక్కడపల్లి, మే 5 (ఆంధ్రజ్యోతి): సివిల్స్‌కు ప్రిపేరయ్యే అభ్యర్థులు ఆచరణాత్మక అధ్యయన ప్రణాళికలు రూపొందించుకోవాలని సివిల్స్ 2023లో ఆలిండియాలో 499 ర్యాంకర్ నవనీత్ ఆనంద్, 521 ర్యాంకర్ హర్షిత్ శ్రీవాస్తవ్ అన్నారు. ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని విజన్ ఐఏఎస్ కోచింగ్ సెంటర్‌లో ఆదివారం ఉదయం సివిల్స్ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు ఉచిత అవగాహన సదస్సు విజన్ సంస్థ బ్రాంచ్ హెడ్ హరికృష్ణసింగ్ అధ్యక్షతన జరిగింది. సివిల్స్ పరీక్షలు ఎలా రాయాలి ప్రిలిమినరీ, మెయిన్స్, ఇంటర్వ్యూలలో ఎలాంటి ప్రశ్నలు వస్తాయి, ఎలా ప్రిపేర్ కావాలి సమయపాలన, ఎలా చదవాలి, తదితర అంశాలు వారు అభ్యర్థులకు కూలంకషంగా వివరించారు.

రాహుల్‌గాంధీకి ఘన స్వాగతం



ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం సాయంత్రం నగరానికి వచ్చిన ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీకి శంషాబాద్ ఎయిర్ పోర్టులో పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం తెలుపుతున్న సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, ఎంపీ ఎం. అనిల్‌కుమార్ యాదవ్ తదితరులు
- రాంనగర్, ఆంధ్రజ్యోతి